## హిమబిందు






మన గాలి, మన నేల, మన వాళ్ళు,
మన లోగిళ్ళు...... నెలనెలా ఓ దృక్కోణం

ఎంత ఒద్దనుకున్నా, నా నేల, నా ఊరు, నా ఊరు అంటూ మన మనసు పరుగులు తీస్తుంది.... సప్త సముద్రాలు దాటైనా, భూత భవిష్యత్ కాలాల్లోకైనా, సరిహద్దుల ఫెన్సింగ్‌లు ఎన్ని ఉన్నా... రెప్ప పాటులో పయనించగల వేగం దాని సొంతం... అందుకే పగ్గం వేయలేని ఈ మనసుకి అందిన, స్పర్శించగలిగిన ఆవలితీరాన్ని మీ ముందు ఆవిష్కరించే చిరు ప్రయత్నం చేస్తున్నాను. ‘ఆవలితీరానికి‘ ఆలోచనిచ్చిన నా స్నేహితురాలు ఇంద్రాణి ఇన్నుగంటి భూమికను ఎప్పటికీ విస్మరించలేను.

### లాంగ్ ‘మార్చ్‘

‘అడువారి మాటలకు అర్థాలు వేరులే‘... అంటుంటారు కానీ అసలు చాలా మంది మగవాళ్ళ మాటలకి అర్థమే ఉండదు అని అభిప్రాయం! ఈ మధ్య ఓ స్నేహితుడు ఫోన్ చేసి మరీ, ‘మార్చిలో ఏం రాస్తున్నావు‘ అన్నాడు. ‘ఏముంది, మార్చి అనగానే ముదుగా గుర్తొచ్చేది ఎనిమిదో తారీకున జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవం... కాబట్టి మన దేశంలో, ముఖ్యంగా మన రాష్ట్రంలో మహిళల స్థితిగతుల గురించి రాద్దామనుకుంటున్నాను‘ అని చెప్పాను.. ‘పాపం! ఏమంత కష్టం వొచ్చింది నీకు, ఇండియాలో ఉన్నప్పుడు ఎవరు నిన్ను అణచివేశారు, అమెరికాలో ఏం దౌర్జన్యాలు జరిగాయి నీ మీద.... ఫన్నీగా మాట్లాడకు..... ఇరవై ఒకటో శతాబ్దంలో కూడా, అసహ్యంగా మహిళా దినోత్సవం ఏంటి? నన్నడిగితే అసలా రోజుని తీసెయ్యాలి, సంవత్సరంలో ఒకరోజు మహిళలదైతే, మిగతా 364 రోజులు మగవాళ్ళవనా....(వెటకారం)? నీకో విషయం చెప్పనా... మోడలింగ్ ప్రపంచంలో ప్రతిరోజూ ఒక ‘విమెన్స్ డే‘నే... మరి మగాళ్ళు మీలా ఏడుస్తున్నారా..? అసలు మిమ్మల్ని మీరు గౌరవించుకుని, ఇతరుల్ని గౌరవిస్తే ఏ బాధా ఉండదు.... అంతేకానీ, ఎందుకలా, దీనంగా..?! మేం మహిళలం.... ఇది మా రోజు... అని అరుపులు... కేకలు.... నువ్వేమనుకోనంటే ఓ మాట చెప్పనా... ఏసీ రూమ్‌లో తీరి కూర్చుని... ఓ ఏడుపు గొట్టు మహిళా చిత్రం చూస్తూ.... బక్కెటడు కన్నీళ్ళు కార్చేంత గొప్ప అభిరుచి ఈ విషయంలో నీది.. ‘ అని తేల్చాడు.

అతనంత గొప్ప అభిప్రాయాం వెలిబుచ్చిన తరువాత తేరుకోవడానికో నిమిషం పట్టిందనుకోండి, కానీ నేను కూడా ఆలోచించాను... రాష్ట్రంలో దేశవ్యాప్తంగా ప్రభుత్వ పదవులు, రాజకీయ అధికారాల కోసం రిజర్వేషన్ అమలు చేయాలని, సాంఘిక సమానత్వం కావాలని పలు మహిళాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మరి, అలా పోరాటం చేయడం మహిళలు తమని తాము తక్కువ చేసుకోవడమా? మహిళా దినోత్సవం అనగానే కలిగే భావోద్వేగం ‘అవుట్‌డేటెడా‘? ఎదురవుతున్న సమస్యల్ని చర్చించుకునేందుకు కూడా

మహిళలు సంఘటితం కావాల్సిన అవసరం లేదా? అసలిలాంటి 'రోజు'ల నుంచి స్ఫూర్తి పొందే స్థాయిని దాటి ముందుకు వెళ్ళామా... మన జీవితాలన్నిటా... పచ్చదనమే పరచుకుని ఉందా? అని.

1945వ సంవత్సరంలోనే శాన్‌ఫ్రాన్సిస్కో నగరంలో జరిగిన యునైటెడ్ నేషన్స్ సమావేశం 'సమానత్వాన్ని మానవహక్కు'గా తీర్మానం చేసింది. సామాజిక న్యాయానికి వీటిని పునాదిగా చెపుతూ, ప్రపంచదేశాలన్నీ ఈ హక్కుని గుర్తించాలని కూడా కోరింది. ఈ సమానత్వపు హక్కుని మన భారతీయ సమాజం లేదా మన ఆంధ్రులకి, ముఖ్యంగా మహిళల విషయంలో అన్వయించుకుంటే... నేటి మన సమాజంలో ఎంతమంది మహిళల్లో ఉంది? ఒక వేళ ఉన్నా, దానిని పరిరక్షించుకునే, లేదా అమలు చేయగల సామర్ధ్యం ఉందా? అనేవి నాకు కలిగిన తొలి ప్రశ్నలు.

మన సమాజంలో 'పురుషుడితో సమానత్వం' కోరుకోవడం... 'పొగరుబోతుతనం' 'ఫెమినిజం' 'సమాజవిరుద్ధం'. సమానత్వానికి పురుష, స్త్రీ, కుల, మత, జాతి భేధాలు లేనప్పటికీ దాన్ని సాధించడానికి స్త్రీలు పోరాటం చేశారు... ఇంకా చేస్తూనే ఉన్నారు అంటే... అది ఎవరి మెహర్బానీ? స్వేచ్ఛ పుట్టుకతో వచ్చిన హక్కయినపుడు దాన్ని అనుభవించాలనే స్పృహ మహిళల్లో ఇంకా రాకపోవడానికి వెనుక ఉన్న 'కుట్ర' ఏమిటి? దాని వల్ల ఎవరికి లాభం?

అలా అని ఆంధ్రదేశపు మగవాళ్ళందరూ వాళ్ళ భార్యల్ని, పిల్లల్ని, తల్లుల్ని రాచి రంపాన పెడుతున్నారనేది నా ఉద్దేశం కాదు. ఉదాహరణకి ఏ బాదరబందీలేని జీవితాలను గడుపుతున్న కొంత మంది మహిళల్ని తీసుకుందాం.. వీరు విద్యావంతులు, ఆర్థికంగా స్థోమత కలిగిన వారు అలాగే తమ భర్త లేదా ఇతర పురుషుల నుంచి శారీరక, సామాజిక దౌర్జన్యాలకు గురి కాలేదని కూడా అనుకుందాం... అయినప్పటికీ, వారందరూ సమాజంలో పురుషునితో సమానమైన హక్కుని కలిగి ఉన్నారా అనేది ప్రశ్నార్థకమే! ఎందుకంటే, సమాజంలో కుటుంబం అనేది ప్రధాన వ్యవస్థ. దానిలో వివాహమనే బండికి భార్యా,భర్త రెండు చక్రాల్లాంటి వాళ్ళని మనం నొక్కి వక్కాణించుకున్నప్పటికీ, కుటుంబ పరమైన ప్రధాన నిర్ణయాలు తీసుకోవడం ఇప్పటికీ భర్తల ఆనవాయితీనే. గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పండి... మనది పితృస్వామ్య వ్యవస్థ కాదంటారా? విచిత్రమేమిటంటే అసలందులో తప్పేంటి? ప్రకృతి విరుద్ధం కాకుండా ఉండాలంటే ఈ వ్యవస్థే సరైనది అని వాదించే వాళ్ళే మన సమాజంలో ఎక్కువ. మరి, పితృస్వామ్య లక్షణాల్లో స్త్రీకి సమానత్వమనే ప్రతిపాదన ఏమీ లేదే?! అటువంటప్పుడు, తమ హక్కుని సాధించుకోవడానికి అవసరమైన కార్యాచరణకు మహిళలు ఎందుకు నామోషీ పడాలి?

సామాజిక శాస్త్రం ప్రకారం చెప్పాలంటే, సంప్రదాయ సమాజంలోని కుటుంబ పెద్ద(పురుషుడు... అందులోను 'నాగరికత' పట్ల విశ్వాసం ఉన్న వ్యక్తి) నేడు భార్యని లేదా కుటుంబంలోని ఇతర సభ్యుల్ని, తోటి ప్రాణులుగా 'గుర్తించి' గౌరవించడం, మానవీయ దృక్పథంతో వ్యవహరించడం అలవాటు చేసుకున్నప్పటికీ, 'అధికారం' కుటుంబ సభ్యులందరితోను సమానంగా పంచుకునేందుకు ఇంకా సిద్ధంగా లేడు. సింపుల్‌గా చెప్పాలంటే, ఆయన కొట్టకుండా, తిట్టకుండా... 'తనదైన' విశాల దృక్పథాన్ని ప్రదర్శిస్తున్నాడు కనుక మహిళలం అదే ధన్యమనుకోవాలి... మన జీవనశైలిలో, స్త్రీ, పురుష సంబంధాలలో కొన్ని ప్రజాస్వామికమైన మార్పులు (మధ్య తరగతి ఆపైన వర్గాల్లో) చోటు చేసుకుంటున్నప్పటికీ 'వ్యవస్థ'లో మాత్రం పెద్ద మార్పు రాకపోవడమే సమానత్వానికి పెద్ద అడ్డుగోడ.

మన వ్యవస్థ కుటుంబం నుంచి మొదలవుతోంది కనుక మన ఇళ్ళలో మహిళలకి ఎంత సమానత్వం ఉందో తెలుసుకోవడానికి కొన్ని సాధారణమైన ప్రశ్నలు వేసుకుందాం..... భర్త ఇంటి పేరు భార్య ఎందుకు పెట్టుకుంటుంది? పెళ్ళవగానే ఆమె 'అస్థిత్వం' ఎందుకు మారిపోవాలి? తండ్రి ఇంటి పేరే పిల్లలకి పెడతాం, పిల్లలకి తల్లి ఇంటి పేరు పెడితే ఎలా ఉంటుంది అని 'కనీసం' ఎప్పుడైనా పరిశీలించారా? తల్లి ఇంటి పేరే పెట్టి తీరాలని నేను వాదించడం లేదు. కానీ ఆమెకున్న హక్కుకి గుర్తింపు లేకపోవడం అనేది అభ్యంతకరం. (తమిళనాడులో తల్లి ఇంటి పేరు కూడా పిల్లలకి పెట్టుకునేలా కొత్త చట్టం తెచ్చారు... అదే లాటిన్ అమెరికన్ సమాజంలో అయితే తల్లి తండ్రి ఇద్దరి ఇంటి పేర్లు జాయింటుగా పిల్లలకి పెడతారు). ఇక మన

వ్యక్తిగత చట్టాలన్నీ కూడా 'మతా'ను సారంగా వచ్చాయి కనుక తల్లి ఎంతటి ప్రతిభావంతురాలు, సామర్థ్యం కలిగిన వ్యక్తి అయినా తండ్రే గార్డియన్. ఈ వ్యక్తిగత చట్టాల్లో ఎప్పుడు మార్పులు వస్తాయి...? పిల్లల విషయంలో, తాను కూడా సమాన హోదా కలిగి ఉండాలని ఏ మహిళ కోరుకోదు? ముఖ్యంగా భార్యాభర్తలు విడిపోయిన సందర్భాల్లో తల్లి ఎదుర్కొనే మొదటి సమస్య ఇది.ఎవరూ ఏం మాట్లాడకుండానే, ప్రశ్నించకుండానే ఇటువంటి విషయాలలో న్యాయం ఎలా సాధ్యం? మీరనచ్చు. మా ఇంట్లో మహిళలు ఎవరూ స్వేచ్ఛా, సమానత్వాల్ని డిమాండ్ చెయ్యడం లేదు. లేదా, వారికా అవసరం కనిపించడం లేదని. ఒప్పుకుంటున్నాను... 90 శాతానికి పైగా భారతీయ మహిళలకి 'పురుషుడితో సమానత్వం, పరిపూర్ణ స్వేచ్ఛ'అనేవి 'ఫారిన్' కాన్సెప్ట్స్. తరతరాలుగా ఎవరో ఒకరి ఆధీనంలో ఉండటం వల్ల ట్యూన్ అయిపోయిన మానసిక స్థితి అది. అంతమాత్రాన స్వేచ్ఛా, సమానత్వాలు వారికి అఖ్ఖర్లేదని కాదు. అందులోని ఉత్తేజపు ఆనవాలుని వారింకా పసిగట్టలేదంతే. ఆక్సిజన్ అవసరం లేదని ఎవరైనా అంటారా?

మన మహిళలు దేశ విదేశాల్లో, అనేక రంగాల్లో దూసుకుపోతున్నా కూడా, ఇంకా ఎందుకు అత్యాచారాలు, దౌర్జన్యాలు, భ్రూణ హత్యల్లాంటి వ్యతిరేక కోణాల్నే ఎత్తి చూపాలని ప్రయత్నిస్తారు? అనేది తరచూ వినిపించే ప్రశ్న... లేదా కార్పొరేట్ మార్కెటింగ్ బుర్రకెక్కించిన 'సోకాల్డ్ పాజిటివ్' తెగులు....

మన రాజ్యాంగాన్నే తీసుకుంటే, మహిళలకి.. దళితులు, వెనుకబడిన వర్గాలతో సమాన హోదాని ఇచ్చారు. ఎటువంటి సామాజిక, ఆర్థిక వెనుకబాటు తనాలు లేకుండానే, 'నిర్ధారించకుండా'నే ఇది జరిగిందా? ఇటీవల జరిపిన ఒక అధ్యయనం ప్రకారం మన దేశంలో ప్రతి 26 నిమిషాలకి ఒక మహిళ అత్యాచారానికి గురవుతోంది. ప్రతి నలభైమూడు నిమిషాలకి కిడ్నాప్‌కి గురవుతోంది, ప్రతి 93 నిమిషాలకి వరకట్నానికి ఆహుతి అవుతోంది... (http://www.hindu.com/2005/09/07/stories/2005090702520200.htm)ఒక్క 2004 సంవత్సరంలోనే గృహ హింసకి సంబంధించి 1,40,000 కేసులు నమోదు అయ్యాయి (http://www.hindu.com/2005/08/13/stories/2005081308340400.htm).భ్రూణ హత్యల కారణంగా ప్రతి సంవత్సరం దాదాపు 5 మిలియన్ల బాలికలు ఇండియాలో అదృశ్యం అవుతున్నారు. (http://www.washingtontimes.com/world/20040917-095116-3780r.htm) ఇటువంటి వాస్తవాల పట్ల సదరు 'పాజిటివ్' థింకర్స్ ప్రతిస్పందన ఏమిటి?... బయటికి పొక్కితే ఇండియా పరువు పోతుంది కాబట్టి కార్పెట్ కింద కప్పెట్టెయ్యాలనేగా?!

విదేశాల్లో ఉన్న తెలుగు మహిళలు గృహ హింసకు గురవుతున్న కేసుల పెరుగుదలను దృష్టిలో పెట్టుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ఒక కొత్త విభాగాన్ని ఏర్పాటు చేసింది ... పనిలేక, తోచక ఈ విధంగా జరిగిందంటారా?

ఆర్థిక, రాజకీయ రంగాల్లో మహిళల భాగస్వామ్యం గురించి 166 దేశాల్లో జరిపిన అధ్యయనంలో మనదేశం 110 వ స్థానంలో ఉంది... అంటే మన మహిళల అభివృద్ధి వేగం రేటు ఎంత?!

మహిళా దినోత్సవం అంటే మహిళలు ఆకాశంలో విహరించే రోజేం కాదు... కొత్త ఊపిరిని ఎలా నింపుకోవాలని, ముందుందు సాధించాల్సిన లక్ష్యాల గురించి ఆలోచించుకోవాల్సిన రోజు... కనుక

Don't disturb...

